# ధర్మరాజు

— శశిశ్రీ

ఆదివారం సెలవు దినం. ఇంటి వద్ద తీరిగ్గా వున్నాను. తెలుగు దినపత్రిక హెడ్డింగులు చదువుతున్నాను.

బయట నన్ను ఎవరో పిలిచారు. "ఎవరో లోపలికి రండి" అన్నాను.

డెబ్భై యేళ్ళు పైబడిన పెద్ద మనిషి, ఆయన్తో ఇరవై ఏళ్ళ కుర్రాడొకడు లోపలికొచ్చారు. ఆ పెద్దాయన మొత్తం భూ భారాన్నంతా మోస్తున్నవాడిలా, జీవితంలో చేదు నిజాలు రుచి చూసినవాడిలా వున్నాడు.

వారిద్దర్నీ కూర్చోమని చెప్పేవప్పటికీ కూర్చోక అలానే నిల్చొని ఏదో తమ బాధను చెప్పుకోడానికి అనుమతి కోసం వేచి వున్నవారిలా వున్నారు.

పత్రికా విలేకరిగా నేను ఇలా రోజూ ఎందర్తోనో మాట్లాడాల్సి వుంటుంది. ఎన్నో విషయాలు, ఎన్నో బాధలు, ఎన్నో గాథలు, అవి ఒక్కొక్కరు ఒకొక్క విధంగా చెప్తుంటారు. కొన్ని పత్రికల్లో రాసేవి! కొన్ని రాయలేనివి!! ఇప్పుడు ఈ ఇద్దరు వ్యక్తులు చెప్పబోయేది ఏ కోవకు చెందుతుందో!

పత్రికలలో వార్తలు వస్తే ఆ సమస్యలు ఎంత వరకు తీర్తున్నాయో కానీ, వార్త అంటూ వస్తే చాలు– అది యిచ్చినవాళ్ళు నిజంగా తమకు సగం మేలు జరిగి పోయినట్లు భావిస్తుంటారు.

చదువుతున్న తెలుగు దినపత్రిక పక్కన పెట్టి "ఎవరు మీరు? ఏమిటో చెప్పండి?" అన్నాను.

"నా పేరు యేసన్న. వీడు నా కొడుకు. ఇంటర్ వరకు చదువుకున్నాడు. మాది లక్కిరెడ్డిపల్లి తాలూకా! మా వాడి గురించి మీ పత్రికలలో వార్త రాయాల్సార్!

ఉన్న పొలం చెక్క, రెండు కాడెద్లు అమ్మేసి, ఇంట్లో మా ఆడోళ్ళ చెవుల కమ్మలు, ముక్కు పుడక అన్నీ అమ్మి పది వేల రూపాయిలు, వీడు బైటి ప్రాంతాలకు పోతానంటే ఆ ఏజెంటు కిచ్చి పంపమని కాళ్ళు, కడుపులు పట్టుకున్నాను.

"ఆ డబ్బులు తీసుకొనేదాకా బైటి ప్రాంతానికి పంపిస్తానని, ఆఫీసులో పని యిప్పిస్తానని, జీతం నెలకు మూడు వేలు వుంటుందని, ఎన్నో చెప్పి, మా బతుకు పిండి ఇచ్చిన సొమ్ము తీసుకొని మా వాడ్ని వెంట బెట్టుకొని బొంబాయికి తీసుకెళ్ళాడు.

"నెల, రెండు నెలలు, ఆరు నెలలు గడిచి పోయాయి. కానీ, మావాణ్ణి బైటి ప్రాంతాలకు పంపలేదు! పైగా తిట్టి భయపెట్టి పంపేశాడు. దిక్కున్న చోట చెప్పుకోమని, మా బతుకుల్లో నిప్పులు పోశాడు.

"రైలు ఛార్జీల క్కూడా డబ్బుల్లేక, దొంగ రైలెక్కి వస్తుంటే, పట్టుకొని జైల్లో పెట్టివారు. ఆ విషయం మా వాడు రాస్తే నేనే పోయి వీణ్ణి పిల్చుకొచ్చాన్సార్! మా వానికి జరిగిన అన్యాయం మీరు మీ పత్రికలో వేయండ్సార్" అన్నాడు ఆ పెద్దాయన.

వారికి జరిగిన అన్యాయం నన్ను కలచివేసింది. వాళ్ళపై జాలేసింది. వీళ్ళకు న్యాయం జరుగుతుందో, జరగదో కాని, వార్త వేసి వాళ్ళకు కొంచెం ఊరటైనా కల్గిస్తాననుకొన్నాను.

వాళ్ళను ఓదార్చి, వార్త వేస్తానని గట్టిగా చెప్పి పంపేశాను. వారం రోజులు గడిచాయి.

నేను రాసిన వార్త బాక్సైటంగా పేపర్లో వేశారు. వార్త చదువుకొని మరోమారు ఆ పేదవాని గురించి తల్చుకొని బాధగా నిట్టూర్చాను.


ఇంతలో ఫోన్ మోగింది. ఫోన్‌లో పోలీసు సూప రింటెండెంట్ రావుగారు మాట్లాడారు. వెంటనే బయల్దేరి రమ్మన్నారు.

ఏదో విశేషమే వుంటుందని త్వర త్వరగా బయల్దేరి ఎస్.పి. ఆఫీసు చేరుకున్నాను.

అక్కడ సహచర పత్రికా విలేకర్లు కూడా వున్నారు.

నేను అక్కడికి చేరుకోగానే ఎస్.పి.గారు, ఎస్.ఐ.ని పిలిచి, "ధర్మరాజు గ్యాంగ్‌ను తీసుకు రండి" అన్నారు.

ఎస్.ఐ. ముగ్గుర్ని మా ముందు ప్రవేశపెట్టాడు. ఆ ముగ్గుర్లో ఒకడు ఆరడుగుల భారీ విగ్రహం. చూడ డానికి సేఠ్‌లాగ వున్నాడు. కానీ ఆ వ్యక్తి మన ప్రాంతం తాలూకు వాడేనన్న అనుమానం మాకు కల్గింది. మిగి



లిన యిద్దరు సన్నగా, పొట్టిగా సినిమా హాల్లో బ్లాక్ టిక్కెట్లు అమ్ముకొనే పిప్పీ దొంగల్లా వున్నారు.

ఎస్.పి. మా మౌనాన్ని భంగపరుస్తూ-మాట్లాడారు "వాడు ధర్మరాజు. కానీ బైటి ప్రాంతాలకు చెందిన సేఠ్‌గానిగా ప్రజలను నమ్మించి ఆ యిద్దరి సాయంతో పేదల రక్తం పీల్చుతున్న జలగ వీడు!!

ఒక్క మన జిల్లా నుండే దాదాపు అయిదు వందల మందిని వీళ్ళు చిత్తుగా మోసం చేశారు.

చాలా కష్టం మీద, ఎంతో చాకచక్యంగా మా వాళ్ళు ఈ గ్యాంగ్‌ని పట్టుకున్నారు. చూడ్డానికి వీళ్ళు పిప్పి దొంగల్లా వున్నా, వీళ్ళది పెద్ద దోపిడి గాళ్ళ ముఠా! ఆ ఇద్దరు గల్ఫ్‌దేశాలకు పంపిస్తానని ఈ కేటుగాణ్ణి చూపించి, సేఠ్‌గా నమ్మించి ఉత్తుత్తి ఇంటర్‌వ్యూలు జరిపి పేదల నుండి భారీగా డబ్బు దోచుకున్నారు. వీళ్ళ పాపం పండింది. ఇప్పుడు దొరికారు. ఈ ధర్మరాజు ఉరఫ్ సేఠ్ ఎలా పేద ప్రజలను నయవంచనకు గురి చేశాడో, వీడి నోటితోనే చెప్పిస్తాను-వినండి" అని, "రేయ్! నీవు ఎలా ఇంటర్‌వ్యూలు జరిపేవాడివో చెప్పు" అన్నారు ఎస్.పి. రావుగారు.

ఆ డూప్లికేట్ సేఠ్‌గాడు వంచిన తల ఎత్తకుండానే మౌనంగా వున్నాడు. ఈ మారు ఎస్.పి. రావుగారు "ఏంట్రా నీకే చెప్పేది. నువ్ ఎలా ఇంటర్‌వ్యూలు జరిపేది చెప్పమంటున్నాగా" అని పెద్ద స్వరంతో అన్నారు.

ఎలాగైనా వాడ్ని మాటల్లో దింపాలనుకొన్న నేను "నీదేవూరయ్యా?" ప్రశ్నించాను.

ధర్మరాజు ఉరఫ్ సేఠ్‌గాడు తలెత్తి "ఈ జిల్లానే సార్" అన్నాడు.

"మరి ఎలా ఇంటర్‌వ్యూలు జరిపేవాడివి?" అన్నాను నేను.

"నేను పదేండ్ల ముందు ఏ ఉద్యోగం దొరక్క నా కుటుంబాన్ని పోషించుకోలేక పారిపోయి బొంబాయి చేరుకున్నాను. అక్కడ విదేశాల నుంచి వచ్చే ఎందరో ధనవంతుల సేవలు చేసేవాడ్ని! వాళ్ళు మన ప్రాంతానికి ఎందుకు వచ్చేవాళ్ళో, ఏమి చేసే వాళ్ళో దగ్గరుండి గమనిస్తూ వచ్చాను.

"నాకు ఒక రోజు ఒక ఆలోచన వచ్చింది. నేను సేఠ్‌గా అవతారమెత్తి, బైటి ప్రాంతాలకు పంపిస్తానని జనాల్ని ఎందుకు నమ్మించకూడదు? అలా చేస్తే నా దగ్గర కావల్సినంత మంది చేర్తారు! కావాల్సినంత డబ్బు చేర్తుంది!! బాగా డబ్బులు పోగుచేసుకున్నాక చెప్పా చేయకుండా నన్ను గుర్తు పట్టని దూర ప్రాంతాలకు పోయి సుఖంగా జీవనం సాగించాలనుకున్నాను.

"కానీ, నా ధన దాహానికి అంతూ పంతూ లేకుండా పోయింది. పైగా నా చుట్టూ చేరిన డూప్లికేటు ఏజెంట్లు కూడా నా ఆగడాలకు అన్ని విధాల అండ దండలు ఇస్తూ వచ్చారు..." అలావాడు మొదట్నుంచి తన కథ చెప్తుంటే, మధ్యలో ఎస్.పి.గారు జోక్యం చేసుకుని'నీ కథ మా రికార్డుల్లో వుంది. అదక్కరలేదు. నీవు ఎలా ఇంటర్‌వ్యూలు జరిపేవాడివో చెప్పమంటు



న్నాను- ఆ విషయం చెప్పు" అన్నారు.

"సరే సార్" అంటూ మొదలెట్టాడు: "ఏముంది సార్! పేపర్లో మా సంస్థ పేరిట ప్రకటన ఇస్తాం. కుప్ప తెప్పలుగా దరఖాస్తులు వస్తాయి! అలా వచ్చిన దరఖాస్తుల్లో మేమున్న ప్రాంతానికి చాలా దూరంలో వున్న జిల్లాల నుండి ఎంత మంది వచ్చారో చూసుకొని వారికంతా మా ఆఫీసుకు ఫలానా తేదీ లోపల రెడీగా రమ్మని టెలిగ్రాంలు పంపుతాం! ఈ వ్యవహారమంతా వీళ్ళిద్దరూ చూస్తారు.

ఇంటర్‌వ్యూ రోజు పెద్ద హంగామాగా వచ్చి కూర్చుంటాను.

మా వాళ్ళు దరఖాస్తుదార్ల జాబితాను నాకొకటిచ్చి, ఒకటి తమ వద్ద పెట్టుకొని ఒకరొకర్ని పిలుస్తారు.

వచ్చిన మనిషిని బట్టి ఇంగ్లీషు చదవమని కొందరిని, టైపు చేయమని కొందరిని, ఇంగ్లీషులో డ్రాఫ్టింగ్ వ్రాయమని కొందరిని, చేత్తో ఒక కన్ను మూసి చదవమని కొందరిని కోరేవాడ్ని! అలా చేశాక ఇంకొందరిని వాళ్ళ స్వభావాన్ని బట్టి ఇనుప గోలెం నిండా పది ఇటుకలు పెట్టి తల పైకెత్తుకొమ్మని... అలా రకరకాలుగా పరీక్ష పెట్టి పంపేవాణ్ణి.

"అలా ఇంటర్‌వ్యూ జరిపిన రెండవ రోజే ఒకరిద్దరి పేర్లు మినహాయించి అందరి పేర్లు మా ఆఫీసు నోటీసు బోర్డులో ప్రకటిస్తాం.

అలా సెలెక్టు కాగానే మనిషిని బట్టి కాంట్రాక్టు మొత్తం పూర్తిగా, సగము లేదా అందులో సగం మా వాళ్ళు రాబట్టుకుంటారు. ఆ తంతు జరిగిన పది, పదిహేను రోజుల తర్వాత మెడికల్ ఎగ్జామినేషన్ తంతు ఏర్పాటు చేస్తాం.

"బయట ప్రాంతాలకు పంపే ముందు అన్ని పత్రాలు సరిగా వున్నాయో లేదో సరి చూచే కార్యాలయం ఒకటుంది. ఆ కార్యాలయంలోని సిబ్బంది ద్వారా ఎలాగోలా అక్రమంగా మెడికల్ టెస్ట్ కోసం అనుమతి కార్డు సృష్టించుకుంటాం. లేదా అదే విధంగా వుండే టట్లు కార్డులు మేమే దొంగగా అచ్చు కొట్టించి పార్టీకి చూపించి, మెడికల్ టెస్ట్ కోసమని మేం ముందే మాట్లాడి పెట్టుకొనిన మరో డూప్లికేట్ డాక్టర్ వద్దకు వీళ్ళందర్ని తీసుకెళ్తాం. మనిషికి రెండొందల ప్రకారం డాక్టర్ పుచ్చుకుంటాడు. అందులో సగం మేం పుచ్చుకుంటాం.

"మెడికల్ ఎగ్జామ్స్ అయిపోయింది. ఇక మిగతా సొమ్ము ఇమ్మని తీసుకుంటాం. తర్వాత నేను వున్న పళంగా అదృశ్యమై పోతాను. విదేశాలకు తీసుకునిపోయే మనిషి అర్జంటు పని మీద వెళ్ళిపోయాడని, రెండు నెలలు తర్వాత వస్తాడని,'అంత వరకు మీ మీ ఊర్లకు పోయి వుండండి! ఆయన రాగానే టెలిగ్రాంలు ఇచ్చి పిలిపిస్తాం'అంటారు మావాళ్ళు. ఈ తంతులన్నీ ఎటువంటి అనుమానానికి తావు లేకుండా చాలా హుందాగా, దర్పంగా ప్రవర్తించి నమ్మిస్తాం. మేం చెప్పిందంతా నిజమేనని, వాళ్ళు నమ్మి పోతారు. కాల మేమో గడుస్తూ వుంటుంది. వాళ్ళొస్తుంటారు. పోతుంటారు.

"అలా తిరిగి కొత్తవాళ్ళను మోసం చేస్తుంటాము. కానీ ఇప్పుడు పట్టుబడి పోయాన్సార్" అన్నాడు ఆ ధర్మరాజు.

"ఇదండీ వీళ్ళ కథ. మీకు మంచి ప్రెస్ మ్యాటర్ దొరికిందనుకుంటాను" అని, ఎస్.ఐ.ని పిలిచి "వీళ్ళను తీసుకెళ్ళు" అన్నారు.

## పాటల తోట

ఎన్నో సమస్యలు
ఈ లోకంలోన
మది కలవరపరచి
విచారపరచేది
మనిషి మనసులోన
స్వార్థమే పెరిగి
ఎదుటి బ్రదుకునే
నాశనం చేయగ

కొందరికి స్వర్గం
కొందరికి నరకం
కాగా అందరూ
సుఖించే దెపుడో!
పాటల తోటలో
ఎగిరే కోయిలను
మాటల చిగురులే
ఆహారం నాకు

—మందరపు హైమవతి